# పుస్తక పరిచయం




**_Published by:_**

Vanguri Foundation of America
PO Box 1948, Stafford
TX-77497, Phone: 832 594 9054
vangurifoundation@gmail.com

**ఉమాభారతిగారు** కూచిపూడి, భరతనాట్యం నృత్యాల్లో నిష్ణాతురాలు. నాలుగు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో కూచిపూడి నృత్యానికి పేరుతెచ్చిపెట్టిన మేటినర్తకిగా గురువుగా ఖ్యాతి పొందారు. పధ్నాలుగవ ఏట అఖిలభారత కూచిపూడి నృత్యపోటీలలో గెలుపొంది, ప్రపంచ సాంస్కృతిక సభలచే ఆహ్వానించబడి. 1ంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే సాంస్కృతిక ప్రతినిధిగా గుర్తింపుపొందిన అప్పటి యువనర్తకి ఉమాభారతిగారు. 20 సంవత్సరాలకే విదేశీపర్యటనలు, జాతీయ అంతర్జాతీయ గుర్తింపు, సినీరంగప్రవేశం, చిత్రనిర్మాణం కూడా చేసి కళారంగంలో ఎనలేని కీర్తినార్జించారు ఉమాభారతిగారు. గత మూడు దశాబ్దాలుగా టెక్సస్ రాష్ట్రంలో హ్యూస్టన్ నగరంలో నివసిస్తున్న ఉమాభారతిగారు అటునర్తకిగా, నాట్యగురువుగా, ఇటు రచయిత్రిగా విశేషమైన సేవలందిస్తున్నారు. రచయిత్రిగా కలం పట్టిన అతి కొద్దికాలంలోనే రెండు కథా సంపుటాలు, రెండు నవలలు పుస్తకరూపంలో వెలువరించారు. వీరు చక్కటి కవయిత్రి కూడా. బహుముఖ ప్రజ్ఞావంతురాలైన ఉమభారతిగారు వ్రాసిన వ్యాససంపుటి ఈ "నాట్య భారతీయం" ఇది కేవలం వ్యాససంపుటి మాత్రమే కాదు, స్వానుభవాలు ప్రధానాంశంగా సాగిన ఆత్మకథానుగతమైన గల్పికల సమాహారం ఈ పుస్తకం. స్వతహాగా రచయిత్రి కావడం వలన ఈ పుస్తకంలోని వ్యాసాలు కేవలం వ్యాసరూపంలో కాక కథాశైలిలో అత్యంత ఆసక్తికరంగా కొనసాగాయి. తన బాల్యం గురించి వ్రాసినా, సోదరుడి గురించి వ్రాసినా, నాన్నగారి గురించి వ్రాసినా ప్రతివ్యాసంలోనూ ఆత్మ కనిపిస్తుంది. ఉమాభారతిగారు వివిధరంగాల్లో కృషిచేశారు కాబట్టి వారి సినీ నటనానుభవాలు, రంగస్థల అనుభవాలు, నట శిక్షణానుభవాలు. .. ప్రతిదీ ఆసక్తికరంగా చదివిస్తుంది. వివిధ రంగాల్లో ప్రవేశమూ, ప్రావీణ్యత ఉన్న ఉమాభారతిగారిలాంటి కళాకారుల జీవనయానంలోని సంఘటనల్లో ఎంతో మంది ప్రముఖులు కనిపిస్తారు. అక్కినేని, ఎన్టీఆర్, సావిత్రి, వెంపటి చినసత్యం లాంటి హేమాహేమీలతో కలిసి పనిచేసిన ఉమాభారతిగారు ఆయా సంఘటనలను చక్కగా మన ముందుంచారు. పుస్తకం చివరలో అరుదైన వర్ణచిత్రాలను కూడా జతచేశారు. అత్యంత అందంగా ముద్రించబడిన ఈ పుస్తకం వంగూరి ఫౌండేషన్ వారి 72వ ప్రచురణ. ఈ వ్యాసాలన్నీ గోతెలుగు డాట్ కామ్ వెబ్ పత్రికలో ధారావాహికంగా వచ్చాయి.

శారదాపూర్ణ శొంఠి, వంగూరి చిట్టెన్ రాజుగార్ల ముందు మాటలు 'నాట్య భారతీయా'నికి నిండుదనాన్ని చేకూర్చాయి. కళా, సాహితీ రంగాల్లో విశిష్టమైన కృషి చేసిన, చేస్తున్న ఉమాభారతిగారికి కౌముది అభినందనలు తెలియచేస్తోంది. ***




**గత కొద్ది సంవత్సరాలుగా** విలక్షణమైన కథలు వ్రాసే రచయితల్లో తరచూ కనిపించే పేరు సన్నిహిత్. ఆయన వ్రాసిన కథల సంపుటి ఈ 'గాలిపటం'. ఇంతవరకూ 50 పైగా కథలూ, ఒక నవల వ్రాసిన సన్నిహిత్ కౌముది పాఠకులకూ చిరపరిచితులే. సన్నిహిత్‌గారు వివిధ పత్రికల్లో ప్రచురితమైన 10 కథలను ఈ సంపుటిరూపంలో మన ముందుకు తీసుకొచ్చారు. సన్నిహిత్‌గారి కథల్లో నేలవిడిచి సాముచేసే పాత్రలు కానీ సంఘటనలు కానీ ఉండవు. ఏ కథా బలవంతంగా వ్రాసినట్లు అనిపించదు. అన్ని కథల్లోనూ సహజంగా కనిపించేది రచయిత ఆలోచన. సమాజంలోని వ్యక్తులనూ, వ్యక్తిత్వాలనూ, సమస్యలనూ నిశితంగా పరిశీలించి, విశ్లేషించి, అవగాహన చేసుకుని వాటికి తనదైన శైలిలో కథారూపం ఇచ్చారు రచయిత. శైలి సరళంగా, సులువుగా, పాఠకుడిని ఇబ్బంది పెట్టని స్థాయిలో ఉంటుంది. కథ చెప్పేప్పుడు ఎక్కడా అస్పష్టతగానీ, తడబాటు కానీ ఉండదు. కథ వ్రాసే ముందే రచయిత ఎంతో కసరత్తు చేశారన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఎక్కువ కథల్లో ఒక సమస్యను తీసుకుని దానికి పోలికగా మరో సంఘటనను చూపించి మొదటి సమస్యకు పరిష్కారం చూపిస్తారు. ఈ తరహా కథలు పాఠకులను ఆలోచింపచేయడమే కాక ఒక్కోసారి భుజాలు తడుముకునేలా కూడా చేస్తాయి. మొట్టమొదటి కథ "ఒకే గూటి పక్షులు" లో ఆఫీసుపని మీద బయటకు వెళ్ళినప్పుడు దొంగబిల్లులు పెట్టిన పెద్దమనిషి, లంచాలకోసం కక్కుర్తిపడే పోలీసుని విచిత్రంగా చూడ్డం తర్వాత తను చేసిన (దొరతనం ముసుగులోని దొంగపని) పనిని తలచుకుని తనని తాను అసహ్యించుకోవడం - ఇలాంటి సంఘటనలు చాలామందికి చాలా సార్లు ఎదురయ్యేవే కాని పోల్చిచూసుకుని తమ తప్పుతాము తెలుసుకునే వారు ఎంతమంది ఉంటారో , ఈ నాటి సమాజంలో, అనిపిస్తుంది. 'గాలిపటం' కథ - స్థిరమైన ఆలోచనలు లేని ఒక అమ్మాయి ప్రేమ పేరుతో తరచూ మార్చే స్నేహాలూ - వీటిని చిత్రిస్తుంది. తాను నిర్లక్ష్యం చేసిన అమ్మ, చివరి క్షణాల్లో తనకు రాసిన ఉత్తరం - 'అమ్మ' కథలోని సారాంశం. అమ్మ గురించిన ఇలాంటి కథలు ఎన్నిసార్లు చదివినా కళ్ళు చెమర్చక మానవు. ప్రతి కథనూ ఒక చక్కటి శిల్పంలా మలచడంలో సిద్ధహస్తులైన సన్నిహిత్‌గారి కలం నుంచి మరిన్ని మంచి కథలు రావాలని మనసారా ఆశిద్దాం.

***

**For Copies**

LAV. SANHIT RAO
18-18-254/A/1/57, BharathRatna Colony
Kanchan Bagh, HYDERABAD-500 058
Phone: 94909 56012 ; 94939 84659

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**